క్లుప్తంగా

సామాజిక సర్వేలో తప్పుల తడక

పెనమలూరు: సామాజిక సర్వే తప్పుల తడకగా చేశారని, దీని కారణంగా వర్గీకరణలో లోపాలు జరిగి అర్హులైన వారికి ఫలాలు అందకుండా పోతాయని ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎ.గుప్తా అన్నారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ 2024 సంవత్సరంలో సచివాలయాల వారిగా చేసిన సామాజిక సర్వేలో అనేక తప్పులు జరిగాయన్నారు. మాదిగలను మాలలగా, మాదిగ హిందువులను క్రైస్తవులుగా, ముస్లింలుగా చూపారని ఆరోపించారు. దీని వల్ల మాదిగలకు తీరని అన్యాయం జరిగి వర్గీకరణ ఫలాలు అందకుండా పోతాయని ఆందోళణ వ్యక్తం చేశారు. సర్వేలో అక్రమాలు చేసిన వారిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళణ చేపడతామని హెచ్చరించారు. సర్వేలో తప్పులు విచారించి సరి చేయాలని సూచించారు.

పేదలకు నూతన వస్త్రాలు వితరణ



గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం కెరుస్సో మిషనరీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో బుధవారం 78 మంది వృద్ధులు, పేదలకు చీరలు, దుప్పట్లను రెవరెండ్ డాక్టర్ డేవిడ్ డి. రాజ్ పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వీట్లు అందజేసి కేక్ కట్ చేశారు. అందరు క్రీస్తు మార్గం నడవాలని కోరారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు:కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో బుధవారం ఉపాధ్యాయ సంఘం ఎస్‌టీయూ క్యాలెండర్, డైరీ, స్టిక్కర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యు.టైటస్‌పాల్, నేతలు ఎ.శ్రీనివాసమూర్తి, పి.వి.కృష్ణమోహన్, జయరాజ్, అబ్దుల్‌కాలిక్, కె.పిచ్చేశ్వరరావు, ఎ.సత్యవంతు, పి.సురేష్‌బాబు, ఐ.నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కంకిపాడు: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆర్సీఎం ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కొలకాని మరియన్న అన్నారు. పట్టణంలోని ఆరోగ్య వేళంగణీ మాత దేవాలయం ప్రాంగణంలో మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరియన్న మాట్లాడుతూ క్రీస్తు బోధనలు పాటించాలన్నారు. ప్రేమ, శాంతి, సహనం అనుసరించి తోటి వారికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు, అంబేడ్కర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పెట్ వేడుకలు



కంకిపాడు: విద్యార్థులు వ్యాపార దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఏపీఐసీ-కేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సీఈవో వి. రమాకాంత్ అన్నారు. ఈడుపుగల్లులోని నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్‌లో బుధవారం పెట్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించారు. విద్యా సంస్థల సీఏసీ సుధారాణి స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు లాభనష్టాలను అంచనా వేస్తూ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని చెప్పారు. వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి. నాగలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పెట్ వేడుకల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 30మంది శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది.

మినుమును వదలని చీడపీడలు

- తెగుళ్లు, పురుగుల బెడదతో రైతులకు నష్టం
- క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన శాస్త్రవేత్తలు
- యాజమాన్య చర్యలు కీలకం అంటూ సూచన



చలివేంద్రపాలెంలో మినుము పంటలో యాజమాన్య చర్యలు వివరిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి

కంకిపాడు: మినుము పంటను చీడపీడలు వదలడం లేదు. తెగుళ్లు, పురుగుల బెడదతో రైతులు ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. మేలైన యాజమాన్య చర్యలు అనుసరించకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారంటున్నారు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను సాక్షికి వివరించారు. ఆ వివరాలు..

క్షేత్ర సందర్శనతో గుర్తింపు

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1.5 లక్షల హెక్టార్లలో రెండో పంట సాగు జరుగుతుంది. ప్రధానంగా మెట్ట, మాగాణి నేలల్లో మినుము సాగు చేస్తుంటారు. వరి కోతలు పూర్తయిన పొలాల్లో ఒక పర్యాయం దుక్కి దున్ని మినుము విత్తనాలను చల్లుతున్నారు. ప్రస్తుతం మినుము మొక్క మూరు ఆకు దశలో ఉంది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో క్షేత్ర సందర్శనలు చేసి మినుము పంటలో ప్రాథమికంగా విత్తనశుద్ధి చేపడితే పైరు ఎదుగుదల, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని సూచిస్తున్నారు. విత్తన శుద్ధి చేయకపోవడంతో రసం పీల్చు పురుగులు ప్రధానంగా తెల్లదోమ, పేనుబంక, తామర పురుగులు పంటను ఆశించి రసం పీల్చడమే కాకుండా వైరస్ తెగుళ్లు ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాప్తి చెంది పంటకు నష్టాన్ని కలిగిస్తాయి. తెల్లదోమ పల్లాకు తెగులును, పేనుబంక బొబ్బరాకు, సీతాఫలం తెగులు, తామర పురుగులు తలమాడు తెగులు వ్యాప్తికి తోడ్పడతాయని ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తల బృందం ప్రాథమిక అంచనాకు వచ్చింది. తెగుళ్ల బెడదతో ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాల దిగుబడి కోల్పోతున్నట్లు రైతులు శాస్త్రవేత్తల బృందానికి వివరించారు.



గొడవర్రులో పల్లాకు తెగులు వచ్చిన మినుము పంట



పునాదిపాడులో మొలకెత్తిన మినుము

విత్తనశుద్ధితో చెక్

తొలి దశలో రసం పీల్చే పురుగుల నుంచి 30 రోజులు వరకూ పంటను సంరక్షించుకోవడానికి విత్తనశుద్ధి ఒక్కటే సరైన మార్గం. కిలో విత్తనానికి ఐదు గ్రాములు థయోమిథాక్సమ్ 70 డబ్ల్యూఎస్ లేదా ఐదు మిల్లీలీటర్లు ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ మందుతో విత్తనశుద్ధి చేసుకుని విత్తనం చల్లితే తొలిదశలో పంటను ఆశించే రసం పీల్చు పురుగుల నుంచి తద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్ల నుంచి పంటను సంరక్షించుకోవచ్చు.

గత కొంతకాలంగా మినుము మొక్కలకు కాండం గజ్జి తెగులు ఆశించి మొక్కలు చనిపోతున్నాయి. కాండం దగ్గర గజ్జిలా ఉబ్బెత్తుగా తెల్లటి మచ్చలు మొదలై క్రమేపీ ఆ మచ్చలు ముదురు గోధుమ రంగుకి మారి గజ్జి మచ్చలు మొక్క పైభాగానికి పెరుగుతూ ఉంటాయి. మొక్క ఎదుగుదల లోపించి కుంచించుకుపోతాయి. ఈ తెగులు నివారణకు కిలో విత్తనానికి 1.5 మిల్లీలీటర్ల టేబుకొనజోల్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవడం మంచిది. రసాయన మందులు కుదరని పక్షంలో జీవ శిలీంద్రనాశిని ట్రైకోడెర్మా విరిడిని కిలో విత్తనానికి 10 గ్రాములు చొప్పున కలిపి పొలంలో విత్తనం చల్లుకోవాలి. ట్రైకోడెర్మావిరిడి హాని కలిగించే శిలీంద్రాలను పెరగనివ్వకుండా మొక్క పెరుగుదలకు అవసరమైన పోషకాలు వేగంగా గ్రహిస్తుంది. వ్యాధికారక శిలీంద్రాల పెరుగుదల, పునరుత్పత్తిని నిరోధిస్తుంది.

విత్తనశుద్ధి ప్రధానం



పైరు ఎదుగుదల, తెగుళ్ల బెడద లేకుండా ఉండాలంటే విత్తనశుద్ధి ప్రధానం. మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుని సమర్థంగా విత్తనశుద్ధి చేసుకోవాలి. లేనిపక్షంలో సాగు ఆరంభం నుంచే సస్యరక్షణ చర్యల కారణంగా పెట్టుబడులు అధికం అవుతాయి. ఆర్థికంగా నష్టాన్ని చూడాల్సి వస్తుంది. విత్తనశుద్ధి చేసుకుని సాగు లాభదాయకంగా మార్చుకోవాలి.

డాక్టర్ డి.సుధారాణి, కోఆర్డినేటర్, కృషి విజ్ఞానకేంద్రం, ఘంటసాల

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. కంకిపాడులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తామన్నారు. మెరుగైన విద్యా బోధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుచ్చయ్యబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అదనపు సెలవులు ఇవ్వాలి

గన్నవరం రూరల్: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు సాధారణ సెలవులతో పాటు ఐదు రోజులు అదనపు సెలవులు మంజూరు చేయాలని కోరుతూ ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వి.రవికుమార్‌కు బుధవారం గ్రంథాలయ సంస్థ ఉద్యోగ సంఘ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మచిలీపట్నంలో కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు తోకల రాంబాబు, కేవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సాలార్ షరీఫ్, షేక్ రహీం తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన నూతన సంబరాలు



సబ్‌రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు



కానూరులో ఆరాధన చేస్తున్న ఫాదర్లు



కంకిపాడులో ఎంపీడీఓ అనూషకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గన్నవరం: నూతన సంవత్సర వేడుకలు గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి నుంచే పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని పలు దేవాలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపారు. స్థానిక విద్యానగర్‌లో కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను జరిపారు. దస్తావేజు లేఖర్ల సంఘ కార్యవర్గం సబ్‌రిజిస్ట్రార్ వీవీవీ ప్రసాద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ నాయకులు తోట వెంకయ్య, కేవీఆర్ కిషోర్, అబ్బాస్, వెంకట్రావు, శ్రీహరి, రాధాకృష్ణ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో..

పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం అర్ధరాత్రి ఘనంగా చేశారు. ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఆరాధన, మాత మాతృత్వ మహోత్సవం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా దివ్యబలి పూజ చేశారు. నూతన జీవితంపై ప్రసంగించి దైవార్చన సమర్పించారు. పూజలో పాల్గొన్న భక్తులకు వాగ్దాన కార్డులు అందించి దివ్య ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, గాయక బృందం, దళ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఫాదర్లు రత్నరాజు, దేవదానం ప్రార్థనలు నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నున్న(విజయవాడరూరల్): నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకొని బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నూతన సంవత్సరంలో ఏసుక్రీస్తు దీవెనలు గ్రామంలో అన్ని కుటుంబాలకు ఉండాలని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ నున్న సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిల్లో ప్రార్థనలు చేశారు. రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు.



గన్నవరంలో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న రమణ, కిషోర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కొత్త ఏడాదిని పురస్కరించుకొని స్థానిక అభయాంజనేయస్వామి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు. మహిళలు, చిన్నారులు కోలాటం ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ నూతన సంవత్సరం పురస్కరించుకుని దివ్య పూజాబలిని సమర్పించారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ప్రార్థించారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా సాగాయి. నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో కేకులు కట్ చేసి మిఠాయిలు పంచి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తిని, ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు ప్రసరించాలని ఆకాంక్షించారు. కంకిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ పి.అనూషను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



దేవభక్తుని చక్రవర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న జి.ప్రణీత్‌కుమార్

విద్యుత్ బిల్లులు దహనం చేసిన సీపీఎం నేతలు



తాడిగడపలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ తాడిగడపలో బుధవారం కరెంట్ బిల్లులను దహనం చేశారు. తాడిగడప కార్మికనగర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పాడ త్రిమూర్తి పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 15,484 కోట్ల కరెంట్ చార్జీల భారం ప్రజలపై మోపిందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కరెంట్ చార్జీలు పెంచేది లేదని, అవసరమైతే తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి కరెంట్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను బాదడానికి రంగం సిద్ధం చేశారని విమర్శించారు. ప్రజలకు అనేక మాటలు చెప్పిన పవన్‌కల్యాణ్ నేడు ఎందుకు మౌనంగా ఉన్నాడని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని డిమాండ్ చేశారు. కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళణ తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పుసులూరి పాతాళ లక్ష్మి, సి.హెచ్.రాంబాబు, ఉప్పాడ ఈశ్వరి, పి.సత్యనారాయణ, టి.లావణ్య, ఎం.కిరణ్, డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణంతో సమాజానికి మేలు



దుప్పట్లు అందజేస్తున్న ఉషారామ విద్యార్థినులు

ఉంగుటూరు: యువత సేవాగుణం అలవర్చుకోవడం వల్ల సమాజానికి మేలు జరుగుతుందని ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నూతన సంవత్సరం పురస్కరించుకుని మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో రోడ్డు పక్కన నిరుపేదలకు దుప్పట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. తేలప్రోలు, గన్నవరం, బెంజిసర్కిల్, రామవరప్పాడు, వన్‌టౌన్, నూజివీడు, ఉయ్యూరు తదితర గ్రామాల్లో 300దుప్పట్లు పంచి పెట్టారు. నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులు సేవాగుణంతో పేదలకు దాతృత్వం చాటుకోవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పదిమంది ఉద్యోగాలు క్రమబద్ధీకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో 20ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న పదిమంది ఆలయ పరిచారకులను క్రమబద్ధీకరిస్తూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కె.నాగరాజు, కె.కేశవరావు, ఎం.వి.ఎస్.శాస్త్రి, సీహెచ్.పిచ్చయ్యశాస్త్రి, ఎం.రాధాకృష్ణమూర్తి, పి.అశ్విన్‌కుమార్, జి.రామారావు, కె.ప్రవీణ్‌శాస్త్రి, కె.ప్రశాంత్‌శాస్త్రి ఈ జాబితాలో ఉన్నారు. ఆలయంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న మరో 54 మంది ఎన్ఎంఆర్‌లు తమను కూడా క్రమబద్ధీకరించాలని, అందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నాయని దేవదాయశాఖ ముఖ్యఅధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ విషయంలోనూ సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు బ్రేక్

- బడ్జెట్ లేకపోవడంతో ఇబ్బందులు
- అధికారులు స్పందించాలని కోరుతున్న రైతులు



పెదపులిపాకలో ఆరబెట్టిన ధాన్యం

పెనమలూరు: రైతులకు కూటమి ప్రభుత్వం ఝలక్ ఇస్తూనే ఉంది. తాజాగా ధాన్యం కొనుగోలుకు బ్రేక్ పడింది. మండల పరిధిలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి బడ్జెట్ లేకపోవడంతో కొనుగోలు నిలిచిపోయి పొలాల్లోనే ధాన్యం రాసులు ఉండిపోయాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలును ప్రభుత్వం ఆలస్యంగా చేపట్టింది. ఆయా గ్రామాల వారిగా రైస్ మిల్లులు కేటాయించింది. రవాణా, గోనె సంచుల కొరతతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత కొంత పరిస్థితి మెరుగవడంతో రైతులు ధాన్యంను మిల్లులకు అమ్మారు. ధాన్యం తరలించిన రెండు, మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము ప్రభుత్వం జమ చేసింది. అయితే గిట్టుబాటు ధర విషయంలో మాత్రం రైతులు దగా పడ్డారు. చాలా మంది రైతులకు గిట్టుబాటు ధర రాలేదు. తేమ పేరుతో మిల్లర్లు, దళారులు రైతులను దోచుకున్నారు.

మిల్లులకు వెళ్లని ధాన్యం

కాగా ధాన్యం కొనుగోలులో మరల బ్రేక్ పడిందని రైతులు తెలిపారు. పెదపులిపాక గ్రామంలో దాదాపు నాలుగు వేల ధాన్యం బస్తాలు(75 కేజీలు) మిల్లుకు తరలించడానికి సిద్ధంగా ఉన్నా సమస్య తలెత్తింది. గ్రామం నుంచి 40 కిలోమీటర్లలోపు దూరంలో ఉన్న మిల్లులకు బడ్జెట్ అయిపోవడంతో ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. తాజాగా మరల బ్యాంకు గ్యారెంటీలు ప్రభుత్వం ఇచ్చి, అనుమతులు పొందిన తర్వాతే ధాన్యం కొనుగోలు జరుపుతామని అధికారులు తెలిపారని రైతులు చెబుతున్నారు. గ్రామంలో ధాన్యం వారం రోజుల క్రితం కాటా వేసినా మిల్లులకు ధాన్యం వెళ్లలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వం ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు పుస్తకమహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల రెండవ తేదీ గురువారం నుంచి 12వ తేదీ వరకూ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో పుస్తక మహోత్సవం జరగనుంది. గురువారం సాయంత్రం ఆరు గంటలకు సాహిత్య వేదికపై పుస్తకమహోత్సవ ప్రారంభ సభలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు సాహితీ జీవితంపై పుస్తకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మొదటి ప్రతిని స్వీకరిస్తారు. ఈ సభలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పుస్తక రచయిత కృష్ణారావు పాల్గొంటారు. పిడికిటి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ ఉంటుంది. దీనికి పుస్తకమహోత్సవ సంఘం గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ అధ్యక్షత వహిస్తారు. తానా పూర్వ అధ్యక్షుడు కోమటి జయరాం, పుస్తకమహోత్సవ సంఘం పూర్వ అధ్యక్షుడు అశోక్‌కుమార్ సభలో వక్తలుగా పాల్గొంటారు.

వృద్ధులు మన జాతి సంపద



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శివయ్య

గన్నవరం రూరల్: వృద్ధులు మన జాతి సంపద అని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాఛారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావుతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను అందరు గౌరవించాలని, ఆదరించాలని చెప్పారు. మన సంస్కృతికి, సాంప్రదాయాలకు పెద్దలు ఎన్నటికీ మరువలేని జ్ఞాపకాలన్నారు. వారిని నిరంతరం పలకరిస్తూ వారి నుంచి, వారి అనుభవాల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. వృద్ధాశ్రమం కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. రిటైర్డ్ అధ్యాపకుడు గన్నే వెంకట్రావు, వీఆర్వో గోపాలరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.